సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ప్రజలు నిలదీస్తారనే మంత్రులు గ్రామాల్లోకి రావడం లేదు
- పదవులు కాపాడుకోవడంపైనే వారి ధ్యాస
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, జూన్ 29: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రజలను మోసం చేశారని విమర్శించారు. శనివారం స్థానిక బీఆర్ఎస్ నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల వద్దకు పాలన పేరుతో సంక్షేమ పథకాల కోసం ప్రతి నెలా దరఖాస్తులు తీసుకుంటామని చెప్పి ఇప్పటి వరకు ఒక్కసారి మాత్రమే స్వీకరించారని విమర్శించారు. కొత్త రేషన్ కార్డులు, రూ.500కు సిలిండర్, జీరో కరెంట్ బిల్, ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని పెద్ద ఎత్తున నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ దరఖాస్తులు తీసుకున్నారే తప్ప పథకాలు అమలు చేసిన పాపాన పోలేదన్నారు. సగానికి పైగా దరఖాస్తులను బుట్ట దాఖలు చేశారని ఆరోపించారు. విద్యార్థులతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించడంతో సగానికి పైగా దరఖాస్తులు ఎంట్రీ కూడా కాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి హామీల అమలుకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. దరఖాస్తుల అప్‌డేట్ కోసం ఎడిటింగ్ ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులు పాట పడిన ట్టుగా రూ.4 వేల పింఛన్ ఇస్తామన్న కాంగ్రెస్ నాయకులు రెండు నెలలకొక్కసారి పాత పింఛన్లు ఇస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు జూన్ నెల ముగిసిపోతున్నదని, వానకాలం సాగు పనులు చేసుకుంటున్న రైతులకు 'రైతు భరోసా' ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏడు నెలల పాలనలో ఉద్యోగాల భర్తీ కోసం ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు. స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం కుంటుపడిందన్నారు. ప్రభుత్వ దవాఖానలో డాక్టర్లు లేక మందులకు కొరత ఏర్పడిందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారని మంత్రులు గ్రామాల్లో తిరుగడం మానేశారని ఎద్దేవా చేశారు. వారు తమ పదవులను కాపాడుకోవాలన్న ఆలోచన తప్ప, ప్రజల సమస్యలను పట్టించుకునే స్థితిలో లేరని విమర్శించారు. ప్రతిపక్షాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించవద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం మంచిది పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు వెళ్తేనే పనులు చేయాలని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఐదుగురు మంత్రులపై అవినీతి ఆరోపణలు రావడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. హామీలను అమలు చేయలేమని కాంగ్రెస్ మంత్రులు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, నాయకులు చేతి చంద్రశేఖర్, సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ఫిర్యాదులొస్తే అధికారులపై చర్యలు తప్పవు
- వీసీలో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జూన్ 29 : ధరణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హెచ్చరించారు. ధరణి దరఖాస్తుల పెండింగ్, రెవెన్యూ తదితర అంశాలపై హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 15 నుంచి 28 వరకు పరిష్కరించిన దరఖాస్తులతో పాటు ఇంకా పరిష్కరించాల్సిన వాటి వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై వచ్చే దరఖాస్తులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యా సంస్థల ఏర్పాటుకు అనుకూలంగా స్థలం గుర్తించాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. వీటిని పరిష్కరించడంలో సీసీఎల్ఏ ఇచ్చే ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులకు లక్ష్యం నిర్దేశించి వారంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ లాగిన్‌లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

జిల్లాలోని తహసీల్దార్లు తమ లాగిన్‌లో ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉంచకూడదని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ రోజుకు 200 దరఖాస్తులపై చర్యలు తీసుకుని ఆర్డీవో నుంచి జేసీ ద్వారా కలెక్టర్ లాగిన్‌కు పంపాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం మాట్లాడారు. ప్రతి రోజూ పెండింగ్ దరఖాస్తులను వివరాలు తెలుసుకుంటామని, తహసీల్దార్ లాగిన్ నుంచి పైఅధికారులకు పంపించే ముందు దానికి సంబంధించి జతపర్చాల్సిన ధ్రువీకరణలు, రిమార్కులు మరోసారి సరిచూసుకోవాలన్నారు. దరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లయితే మరింత సమయాన్ని కేటాయించడంతో పాటు, సెలవు రోజుల్లో కూడా వాటిని పరిష్కరించాలన్నారు. దరఖాస్తును తిరస్కరించడానికి ముందు దానిని రిటర్న్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

కుటుంబ వ్యవస్థను గౌరవించాలి

అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, జూన్ 29 : కుటుంబ వ్యవస్థను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ సూచించారు. తండ్రుల పేరిట పురస్కారాల ప్రదానం ప్రతిభావంతులకు ప్రోత్సాహం ఇవ్వడమే కాకుండా, కుటుంబ వ్యవస్థను కూడా మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. సమైక్య సాహితీ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్‌లో జరిగిన విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గొప్ప వ్యక్తులకు పురస్కారం అందజేయడం గొప్ప సంస్కృతి అన్నారు. కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌కు చెందిన ఆచార్య రజనీశ్రీ పురస్కారాన్ని ఆయన తనయుడు పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఆధ్వర్యంలో పేరిణి నృత్య కళాకారుడు ప్రకాశ్‌కు పురస్కారం చేశారు. అలాగే కరీంనగర్‌కు చెందిన కేఎస్ అనంతాచార్య ఆయన తండ్రి కలకుంట్ల సంపత్ కుమారాచార్యులు పేరిట సంగీత పురస్కారాన్ని సంగీత గురువు రామాచారికి, ఆదర్శ ఉపాధ్యాయుడు మాడిశెట్టి మల్లయ్య పేరిట ఆయన కుమారుడు మాడిశెట్టి గోపాల్ ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తక రచయిత గాజుల రవీందర్‌కు, కవి రావికంటి రామయ్య గుప్త పేరిట ఆయన కుమారుడు రావికంటి శ్రీనివాస్ సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ పద్య కవి, అవధాని ముద్దు రాజయ్యకు, డాక్టర్ నాగభూషణం పేరుతో ఆయన కుమారుడు డాక్టర్ రఘురామన్ తెలంగాణ నవచరిత్ర పరిశోధకుడు ద్యావనపల్లి సత్యనారాయణకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం దేవేందర్, నంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

రాంనగర్ జూన్ 29 : కరీంనగర్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఏఎస్ఐలు బాపు రెడ్డి, కాశెట్టి కిషన్, పీ విజేందర్, ఎన్ లింబా, బాల్‌రెడ్డి, ఎంఏ ముతాలిబ్ శనివారం ఉద్యోగ విరమణ పొందగా, కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిని సీపీ అభిషేక్ మొహంతి శాలువాలతో సన్మానించారు. పోలీస్ శాఖకు వారు అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్ఐ మామిడి సురేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే ధ్యేయం: మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 29: కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, ఉద్యోగుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నదని మేయర్ సునీల్‌రావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శనివారం సీనియర్ అసిస్టెంట్ కనకయ్య, పీహెచ్ వర్కర్లు లచ్చన్న, రాజయ్య, మల్లయ్య ఉద్యోగ విరమణ పొందగా, నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి మేయర్ హాజరై మాట్లాడారు. విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్ నేతికుంట యాదయ్య, అదనపు కమిషనర్ స్వరూపారాణి, ఆర్వో ఆంజనేయులు, బిల్ కలెక్టర్ ఖలీల్, పలు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన మెడికల్ ఆఫీసర్‌కు ఘన వీడ్కోలు

తెలంగాణచౌక్, జూన్ 29: ఆర్టీసీ కరీంనగర్ జోనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపులో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ చేపట్టిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్ విజయవంతం కావడంలో డాక్టర్ మంజుల పాత్ర కీలకమన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ, 32 సంవత్సరాలు విధి నిర్వహణలో సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ మంజుల-రమణారెడ్డి దంపతులను సంస్థ తరపున గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ స్వప్న కుమారి, డిపో-2 మేనేజర్ మల్లయ్య, ఏటీఎం రజినీకృష్ణ, బస్ స్టేషన్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖ ఉద్యోగులకు..

తిమ్మాపూర్ రూరల్, జూన్ 29: మండలంలోని ఎల్ఎండీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఉద్యోగ విరమణ పొందిన నీటిపారుదల శాఖ ఉద్యోగులు బండి కుమార్(కుక్కు గ్రేడ్ 1), జి.కనకయ్య (వాచ్ మెన్), ఎస్.లీల(మజ్దూర్), ఆర్.రామచంద్రయ్య (లస్కర్)ను ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ బి.శంకర్, ఎస్ఈ శివకుమార్ సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఈఈ సమ్మయ్య, టీఏ నీజీవో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, టీఎన్జీవో తిమ్మాపూర్ శాఖ అధ్యక్షుడు పోలు కిషన్, ఎన్టీపీఎ-గెజిటెడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్స్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వీర్యం చేయాలి

కార్పొరేషన్, జూన్ 29: కరీంనగర్‌లోని వివిధ హాస్పిటళ్ల నుంచి వెలువడే వ్యర్థాలను నిబంధనల మేరకు నిర్వీర్యం చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో హాస్పిటళ్ల ప్రతినిధులు, నగరపాలక అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలోని అన్ని హాస్పిటళ్లు బయో వ్యర్థాల సంస్థతో అవగాహన కుదుర్చుకొని దవాఖాన నుంచి వెలువడే కాటన్, సిరంజిలు, తదితర వ్యర్థాలను అప్పగించి నిర్వీర్యం చేయించాలన్నారు. మామూలు చెత్తలో కలిపితే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సుజాత, ఐఎంఏ ప్రతినిధులు, హాస్పిటళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

జమ్మికుంట, జూన్ 29: మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం బల్దియా కమిషనర్ ఎండీ ఆయాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో 47 అంశాలకు సంబంధించిన ప్రతులను సభ్యులకు అందించారు. అనంతరం ఒక్కో అంశాన్ని చదివి వినిపించారు. అంశాల వారీగా సభ్యులు చర్చించారు. 47అంశాలనూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లోని ప్రతి వార్డు అభివృద్ధి కోసం రూ.5 లక్షలు కేటాయించామని తెలిపారు. రుద్రభూమికి రూ.50లక్షలు, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఫాగింగ్ మిషన్, తదితర పనుల కోసం నిధులు వెచ్చిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈలు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సూపరింటెండెంట్లు బదిలీ

కార్పొరేషన్, జూన్ 29: కరీంనగర్ నగరపాలక సంస్థలోని ముగ్గురు సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో నగరపాలక సంస్థలో పని చేస్తున్న ముగ్గురు సూపరింటెండెంట్లను బదిలీగా చేయగా, వారికి తిరిగి నగరపాలక సంస్థలో పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ప్రస్తుతం నగరపాలక సంస్థలో పని చేస్తున్న జనార్దన్, వెంకట్, శ్రీనివాస్‌ను వారి స్థానాలకు తిరిగి పంపించగా.. ఇక్కడి నుంచి బదిలీ అయిన సూపరింటెండెంట్లు బాబు, సునీల్, సంజీవ్‌ను మళ్లీ నగరపాలక సంస్థకు బదిలీ చేశారు. కాగా, వీరిలో బాబుకు జనగాం మున్సిపాలిటీలో అదనపు బాధ్యతలు ఇవ్వగా.. జనగాంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ నియాజ్‌ను నగరానికి బదిలీ చేశారు.

'నీట్' విద్యార్థులకు అండగా ఉద్యమిస్తాం

జమ్మికుంట, జూన్ 29: వైద్య విద్యకు పేద విద్యార్థులను దూరం చేసే కుట్ర జరుగుతున్నదని, 'నీట్' విద్యార్థులకు అండగా ఉద్యమిస్తామని బీఆర్ఎస్వీ జమ్మికుంట పట్టణాధ్యక్షుడు కొమ్ము నరేశ్ స్పష్టం చేశారు. శనివారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 24లక్షల మంది వైద్య విద్యార్థుల భవిష్యత్‌ను నీలినీడలు కమ్ముకున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే ప్రభుత్వాలను తరిమికొడతామని హెచ్చరించారు. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలబడతామని, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇక్కడ నాయకులు హరీశ్‌వర్మ, అరవింద్ గౌడ్, కౌశిక్, శ్రీనివాస్, అజయ్, రమేశ్, తదితరులున్నారు.

'ఆరు నూరైనా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చుతాం'

రాంనగర్, జూన్ 29: ఆరు నూరైనా ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తామని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఉచిత బస్సు సౌకర్యం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.పదిలక్షలకు పెంపు, రూ.ఐదు వందలకు గ్యాస్ సిలిండర్ అమలవుతున్నాయని తెలిపారు.

పవన్‌కల్యాణ్‌కు అభిమానుల ఘన స్వాగతం

గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

కమాన్‌చౌరస్తా, జూన్ 29 : జగిత్యాల జిల్లా కొండగట్టు పర్యటనకు వెళ్తున్న జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు శనివారం కరీంనగర్‌లో అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. గుండ్ల పల్లి టోల్ గేట్ వద్దకు చేరుకున్న ఆయనకు అఖిలభారత సాయి ధరంతేజ్ యువత అధ్యక్షుడు కాసు రాజు ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికి, ఖడ్గం బహూకరించారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్వాగతం పలికేందుకు అభిమానులు తరలిరాగా, ఆయన వాహనంలో నుంచి బయటకు వచ్చి అభిమానులకు అభివాదం చేశారు. అనంతరం ఆయన కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. ఇక్కడ అభిమాన సంఘం నాయకులు బుర్ర అజయ్, కరుణాకర్, అన్వేష్ పటేల్ తదితరులు ఉన్నారు.

మానసిక వికలాంగుల పాఠశాల సేవలు భేష్

తిమ్మాపూర్, జూన్ 29: ఎల్ఎండీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాల సేవలు ప్రశంసనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించి, దివ్యాంగులకు గల ప్రత్యేక చట్టాలను వివరించారు. విద్యార్థులు తయారుచేసిన పేపర్ ప్లేట్లు, కొవ్వొత్తులు కొనుగోలు చేసేలా కృషి చేస్తామన్నారు. జడ్జికి విద్యార్థులు ఘన స్వాగతం పలుకగా, ట్రస్ట్ సభ్యుడు సముద్రాల జనార్దన్ రావు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటి, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీశ్, సైకాలజిస్ట్ నాగేశ్వర్, డ్యాన్స్ మాస్టర్ ధర్మేందర్, యోగా మాస్టర్ స్వరూపాచారి, వృత్తి విద్య శిక్షకులు రమేశ్, ఆనంద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం.. గృహజ్యోతికి సంకటం

- ఐదు రోజులు ఆలస్యంగా రాక.. ₹1393 బిల్లు

గంగాధర, జూన్ 29: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం గృహజ్యోతి లబ్ధిదారులకు శాపంగా మారుతున్నది. 30 రోజుల పీరియడ్ లెక్క బిల్లు కొట్టాల్సి ఉండగా, ఆలస్యంగా వస్తూ నమోదు చేస్తుండడంతో కటాఫ్ రీడింగ్ దాటిపోతూ బిల్లు మోగిపోతున్నది. ఇందుకు కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఆచంపల్లికి చెందిన లబ్ధిదారుడు కడపల నర్సయ్యకు జరిగిన అన్యాయమే నిదర్శనంగా నిలుస్తున్నది. కడపల నర్సయ్య గృహజ్యోతి లబ్ధిదారుడు. పథకం అమలు చేసినప్పటి నుంచి జీరో బిల్లు వస్తున్నది. అయితే ఈ నెల 12న విద్యుత్ శాఖ సిబ్బంది బిల్ కొట్టి అందజేశారు. 237 యూనిట్ల రీడింగ్ నమోదు కావడంతో గృహజ్యోతి వర్తించలేదు. స్కీం కటాఫ్ 200 యూనిట్లు కాగా, 37 యూనిట్లు అదనంగా ఉండడంతో రూ.1393 బిల్లు వచ్చింది. అయితే ఆ బిల్లును పరిశీలించగా 35 రోజులకు కాలానికి గాను బిల్లు కొట్టినట్లు ఉందని, ఐదు రోజులు ఆలస్యంగా బిల్లు లెక్క తీయడంతోనే పథకం వర్తించకుండా పోయిందని నర్సయ్య కొడుకు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి బిల్లు సమయానికి నమోదు చేసేలా చూడాలని కోరుతున్నాడు.

మేకలు, గొర్రెల వధశాల వేలం వాయిదా

కార్పొరేషన్, జూన్ 29: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని గొర్రెలు, మేకల వధశాల బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్లు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో దీనికి వేలం పాట నిర్వహించగా, ఎవరూ హాజరు కాకపోవడంతో జూలై 2న సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

కళాశాలల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాల ఎదుట శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, సహాయ కార్యదర్శి వినయ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాకేశ్, రితీశ్ పాల్గొన్నారు.

టెడ్ నెక్స్ట్ 2024 ఫైనల్స్‌లో పారమిత టెడ్ క్లబ్

విద్యార్థులను అభినందిస్తున్న ప్రసాదరావు

కమాన్‌చౌరస్తా, జూన్ 29 : టెడ్ ఎడ్ క్లబ్బులు స్థాపించి పదేళ్లు పూర్తిచేసుకున్న క్రమంలో అమెరికాలోని అట్లాంటాలో అక్టోబర్ 22 నుంచి నిర్వహించే టెడ్ నెక్స్ట్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ప్రపంచ టెడ్ ఎడ్ క్లబ్బుల్లో అద్వితీయ ప్రమాణాలు పాటిస్తున్న పారమిత టెడ్-ఎడ్ క్లబ్బును టెడ్ ప్రధాన కార్యాలయం పోటీకి ఆహ్వానించింది. ఇందులో భాగంగా, పారమిత టెడ్ ఎడ్ క్లబ్ విద్యార్థులు మధుమోహన్, శ్రీవల్లి, వర్షిణికి ఆహ్వానం అందింది. ఈ క్రమంలో విద్యార్థులను పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు అభినందించారు. అత్యంత కఠినమైన ఈ పోటీలో మొదటి రెండు రౌండ్స్‌లో విజేతగా నిలిచిన ముగ్గురు విద్యార్థులు, ఫైనల్స్‌లో కూడా విజేతలుగా నిలిస్తే విద్యార్థులకు పూర్తి ఉపకార వేతనంతో టెడ్ ప్రధాన కార్యాలయం ద్వారా అమెరికా నుంచి ఆహ్వానం లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ టెడ్ - ఎడ్ క్లబ్ ఎడ్యుకేటర్ హన్మంతరావు, పాఠశాలల డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వీయాఎం ప్రసాద్, రమణ, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, టోర్నమెంట్ నిర్వాహకులు

కొత్తపల్లి, జూన్ 29 : జీనియస్ చెస్ అకాడమీ, తెలంగాణ రాష్ట్ర డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 6, 7వ తేదీల్లో అలుగునూరులోని లక్ష్మీనరసింహ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఓపెన్, అండర్-13 చదరంగ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు కంకటి కనకయ్య, కంకటి అనూప్‌కుమార్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో విజేతలకు రూ 75వేలను నగదు బహుమతిగా అందించడంతో పాటు 100 ట్రోఫీలు ప్రదానం చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాసరెడ్డి, సంగెం లక్ష్మణరావు, తెలంగాణ రాష్ట్ర డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శులు కంకటి సుజన్, తాటిపల్లి సతీశ్ బాబు, జిల్లా డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు అంతగిరి కుమార్, కేశెట్టి, జగన్, రేవిక్, నితిన్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు, ఇతర వివరాలకు టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్‌ను 8341206989 సెల్ నంబర్‌లో సంప్రదించా